

8లో..

## హరీశ్‌ది 'రాజకీయ డ్రామా'

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- అధికారంలో ఉన్న పదేళ్లలో ఏం చేశారంటూ ప్రశ్న



# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 072
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
ఫిబ్రవరి 28, 2026


www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


- బల్దియా ఐకాన్ గా ప్రత్యేక ముద్ర
- జిల్లా అభివృద్ధిలోనూ తన మార్క్ చూపాలంటున్న జనం
- కలెక్టర్, కమిషనర్ గా ద్విపాత్రాభినయం
- ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లోనే మాఢవీధులు
- లక్ష్యం నెరవేరని డబుల్ బెడ్ రూమ్స్
- ముంపుతో మునుగుతున్న నగరం
- ముంచుకొస్తున్న తాగునీటి ముప్పు





వివరాలు2లో..



# ఆశా కిరణం.. చాహత్ బాజ్ పాయ్

నగరాభివృద్ధిలో పట్టు సాధించి బల్దియా ఐకాన్ గా ఇంతకాలం గుర్తింపుపొందిన కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఇప్పుడు కలెక్టర్ గా తన మార్క్ చూపించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ గా, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ గా ద్విపాత్రాభినయం ప్రదర్శిస్తున్న ఆమె అభివృద్ధికి చిరునామా కావాలంటున్నారు. ఇప్పటివరకు అరకొరగా సాగుతున్న పథకాల్లో వేగం పెంచడంతోపాటు అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చొరవ చూపాలంటున్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న మాఢవీధులను త్వరిత గతిన పూర్తి చేయించడంతోపాటు కుడా మాస్టర్ ప్లాన్ అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలంటున్నారు. చినుకు పడితే వర్షపు నీటిలో మునిగిపోతున్న ముంపు కాలనీలతోపాటు ముంచుకొస్తున్న తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపాలంటున్నారు. పెండింగ్ లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ లను త్వరితగతిన పూర్తి చేయించి అర్హులకు అందించాలని, కేయూ టు పెద్దమ్మగడ్డ రోడ్డును తక్షణం వెడల్పు చేసి అక్కడి బాధితులకు ప్రత్యామ్నాయం చూపాలని కోరుతున్నారు. గతంలో కమిషనర్ గా, కలెక్టర్ గా ఓరుగల్లు చరిత్రలో చెరగని ముద్ర వేసిన శాలినీమిశ్రాను తలదన్నేలా చాహత్ బాజ్ పాయ్ అభివృద్ధిని పరుగులు పెట్టించాలని జిల్లా వాసులు కోరుతున్నారు. - వరంగల్ వాయిస్ ప్రతినిధి



8లో..

## ఎన్పీడీసీఎల్ చరిత్రలో సరికొత్త రికార్డు

- గరిష్ట విద్యుత్ డిమాండ్ 6,057 మెగావాట్లు
- సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడి

## విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి

- చేయూతగా 'స్ఫూర్తి' కార్యక్రమం
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



2లో..



లోపలి పేజీలలో..

## జిల్లాలో సైన్స్ సందడి

- వినూత్న ఆవిష్కరణలతో బాల మేధావులు
- సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్న విద్యార్థులు

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, ఫిబ్రవరి 28, 2026

# ఆశా కిరణం.. చాహత్ బాజ్ పాయ్




- బల్దియా ఐకాన్ గా ప్రత్యేక ముద్ర
- జిల్లా అభివృద్ధిలోనూ తన మార్క్ చూపాలంటున్న జనం
- కలెక్టర్, కమిషనర్ గా ద్విపాత్రాభినయం
- ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లోనే మాఢవీధులు
- లక్ష్యం నెరవేరని డబుల్ బెడ్ రూమ్స్
- ముంపుతో మునుగుతున్న నగరం
- ముంచుకొస్తున్న తాగునీటి ముప్పు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ఎంతో మంది ఐఏఎస్ లు వివిధ హోదాల్లో జిల్లాకు వస్తుంటారు.. పోతుంటారు. అందులో కొందరు మాత్రమే తమ ప్రతిభను చాటుకుంటారు. జిల్లాపై తమదైన చెరగని ముద్ర వేస్తారు. భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తారు. అలాంటి వారిలో శాలినీమిశ్రా ఒకరైతే అదే తరహాలో తన ప్రతిభతో ప్రజల్లో చెరగని ముద్ర వేసేలా పనిచేస్తున్నారు ప్రస్తుత హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్. పాలనపై పట్టు, ముక్కుసూటితనం, సమస్యలకు బెదరని తత్వం ఆమెను పది మందిలో ప్రత్యేకంగా నిలుపుతోంది.

## పెండింగ్ లో మాఢవీధులు..

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవాలయం చుట్టూ మాఢవీధులు నిర్మించాలన్న వాదన ఎంతోకాలంగా వినిపిస్తోంది. అయితే దీనిని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అంకురార్పన జరిగినప్పటికీ నిధులు కేటాయించకపోవడంతో పెండింగ్ లో పడింది. సర్వేలు మాత్రం జరిపించి నిర్మాణాన్ని అటకెక్కించారు. తర్వాత వచ్చింన కాంగ్రెస్ ప్రభుత్వం మాఢవాధుల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని రూ.30 కోట్లు కేటాయించినప్పటికీ పనులు ఆగుతూ సాగుతున్నాయి. ఆలయ మాఢవీధుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయడంతోపాటు అక్కడే గుడిసెలు వేసుకొని ఎంతో కాలంగా జీవనం సాగిస్తున్న నిరుపేదలకు డబుల్ బెడ్ రూంలు ఇచ్చి వారిని షిఫ్ట్ చేయాలంటున్నారు. ఇతర పునరావాస కార్యక్రమాలు చేపట్టాలంటున్నారు.

## రహదారులపై చొరవ చూపాలి..

కాకతీయ యూనివర్సిటీ–పెద్దమ్మగడ్డ రోడ్డును వెడల్పు చేయడం ద్వారా ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టవచ్చు. అదే విధంగా బాటిల్ నెక్ మాదిరిగా ఉన్న పెద్దమ్మగడ్డ కార్నర్ ను తక్షణం వెడల్పు చేసి అక్కడి బాధితులకు ప్రత్యామ్నాయం చూపించాలి. అదే విధంగా హనుమకొండ కొత్త బస్టాండ్ నుంచి అశోకా జంక్షన్, కాంగ్రెస్ భవన్ మీదుగా కేయూ (గోపాల్ రావు బిల్డింగ్) రోడ్డు వరకు రహదారిని వెడల్పు చేసి బీటీ వేయించాలని స్థానికులు కోరుతున్నారు. మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహా రావు విజ్ఞాన వేదిక అభివృద్ధి పనులు పూర్తి చేయడంతోపాటు, రూ.572 కోట్ల వ్యయంతో చేపట్టిన ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలంటున్నారు.

## తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ..

రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా వేసవి కార్యాచరణను రూపొందించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే నగరంలోని వేసవి జలాశయమైన భద్రకాలి చెరువును పూడిక తీత పేరుతో నీటిని మొత్తం తొలగించడంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు దారుణంగా పడిపోయాయి. సంవత్సరంలో పూడిక తీత పూర్తి చేస్తామంటూ హామీ ఇచ్చినప్పటికీ రెండు సంవత్సరాలు కావస్తున్నా పనులు మాత్రం సగం కూడా పూర్తి కాలేదు. దీంతో వచ్చే వేసవి కాలంలోనైనా పూడిక తీత పనులను పూర్తి చేసి భద్రకాళి చెరువులో పూర్తి స్థాయి నీటి మట్టం ఉండేలా చూడాల్సిన అవసరం ఉంది.

## మరికొన్ని సమస్యలు..

- ★ జిల్లాకు 7,837 ఇందిరమ్మ గృహాలు మంజూరయ్యాయి. వాటిని త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు బిల్లు చెల్లించాలి.
- ★ జిల్లాకు 2,480 రెండు పడక గదుల ఇళ్లు మంజూరయ్యాయి. అందులో సగం మాత్రమే పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు కేటాయించారు. మిగతావి త్వరితగతిన పూర్తి చేసి నిరుపేదలకు అందించేందుకు చొరవచూపాలి.
- ★ రానున్న వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. ఇప్పటినుంచే కార్యాచరణ ప్రారంభించాలి.
- ★ నూతనంగా 25,699 కొత్త రేషన్ కార్డులు ఇచ్చారు. అర్హులైన వారందరికీ కార్డులు ఇప్పించే ఏర్పాట్లు చేయాలి.
- ★ మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.
- ★ విద్య, వైద్యం, ఆరోగ్య శాఖలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- ★ మెటర్నటీ ఆస్పత్రుల్లో సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలి. వసతి గృహాల్లో సౌకర్యాలపై తనఖీలు చేయాలి.
- ★ హనుమకొండ, పరకాలలో ప్రభుత్వం యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరుచేసింది. అయితే వాటిని వెంటనే ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ తగిన శ్రద్ధపెట్టాలి.
- ★ చేయూత పింఛన్లు సకాలంలో పంపిణీ చేయించాలి.
- ★ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రోత్సాహాన్ని అందించాలి. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ఇప్పించాలి.
- ★ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ల ద్వారా మహిళలకు వృత్తి నైపుణ్యాలను పెంపొందించాలి
- ★ మహిళా సంఘాలకు సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులు అప్పగించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలి.
- ★ కాకాతీయ మ్యూజికల్ గార్డెన్, చారిత్రక కలెక్టర్ బంగ్లా పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలి.
- ★ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమానికి కృషి చేయాలి. ఆయా వర్గాల విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు అందజేయాలి.
- ★ ప్రధాన రహదారులు, ఇంటర్నల్ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలి.
- ★ మొంథా తుపానుతో 2025 అక్టోబర్ 29 నుంచి మూడు రోజుల పాటు కురిసిన వర్షాల కారణంగా సిటీతోపాటు పలు మండలాలు తీవ్రంగా నష్టపోయాయి. తుపాను ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.
- ★ స్మార్ట్ సిటీ పెండింగ్ పనులను తక్షణం పూర్తి చేయాలి.
- ★ రైతులకు పట్టాదారు పాసు బుక్కులు, ఆర్వోఆర్ కాపీలు అందజేయాలి.
- ★ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు, సిబ్బంది భరతం పట్టాలి. ఉద్యోగులు, అధికారులపై మెతలక వైఖని మంచిది కాదు. కట్టు తప్పితే కొరడా విదిలించాల్సిందే.
- ★ ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగనిన పరిష్కరించాలి. ప్రతి పేదవాడికి న్యాయం చేయాలి.
- ★ వివిధ అభివృద్ధి పనులపై నిరంతర నిఘా ఏర్పాటు చేయాలి.

# విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** విద్యార్థుల్లో జీవన నైపుణ్యాల అభివృద్ధి, మానసిక దృఢత్వం పెంపొందించడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా 'స్ఫూర్తి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. శనివారం గీసుగొండ మండలం ధర్మారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు వంచనగిరి కేజీబీవీలో నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమంలో కలెక్టర్ జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా ముచ్చటించి, వారు భవిష్యత్తులో సాధించాలనుకుంటున్న లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యాన్ని నిర్ణయించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని సూచించారు. విద్యార్థులు భయాన్ని జయిస్తే ఏ లక్ష్యాన్నైనా సాధించగలరని, ఆత్మస్థైర్యం పెంపొందించడమే స్ఫూర్తి కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. పరీక్షల నేపథ్యంలో, ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థుల్లో ఉన్న భయాందోళనలు తొలగించి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయడానికి ఈ కార్యక్రమం దోహదపడుతోందన్నారు. మానసిక దృఢత్వాన్ని పెంపొందించే రెండు లఘు చిత్రాలను విద్యార్థులతో కలిసి వీక్షించి, అందులోని సందేశాలను చర్చించారు. యునిసెఫ్, యునెస్కో, ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన జీవన నైపుణ్యాల అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. జిల్లాలోని 99 ప్రభుత్వ మరియు రెసిడెన్షియల్ పాఠశాలల్లో జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, విశ్రాంత ఉపాధ్యాయులు, నిపుణుల సహకారంతో విద్యార్థులకు పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లు, ఒత్తిడిని ఎదుర్కొనే విధానం, సామర్థ్యాల వికాసంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. శారీరక అభివృద్ధితో పాటు మానసిక అభివృద్ధి కూడా సమానంగా అవసరమని పేర్కొన్నారు. అంతకుముందు పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, మధ్యాహ్న భోజన పథకం, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రవీందర్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గంజాయి మత్తును వదిలిద్దాం- యువతను రక్షిద్దాం

**□ వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్**




**వరంగల్ వాయిస్, క్రైం :** దేశ భవిష్యత్తు అయిన యువత గంజాయి మత్తుకు బానిసలు కాకుండా విక్రయ మూలాలపై దృష్టి పెట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అధికారులకు సూచించారు. నేర సమీక్షా సమావేశాన్ని శనివారం కాకతీయ మెడికల్ కళాశాలలో నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ముందుగా పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టు, ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసులు, వారెంట్లు, అధికారులు, సిబ్బంది పనితీరుపై వరంగల్ పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ నేరాల నియంత్రణకై తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. కమిషనరేట్ పరిధిలో పేకాటరాయుళ్లపై కఠినంగా వ్యవహరించాలని, ప్రధానంగా శివారు ప్రాంతాల్లో స్థానిక పోలీసులు నిరంతరం నిఘా పెట్టాలని, చోరీలకు పాల్పడే వారి హిస్టరీ షీట్లను తెరవాలని, అధికంగా చోరీలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా ఎంజీఎం, రైల్వే స్టేషన్ల ప్రాంతాల్లో సైతం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. స్టేషన్ అధికారులు తమ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు జియో ట్యాగింగ్‌కు అనుసంధానం చేయాలని, గంజాయి వినియోగదారులను పట్టుకోవడంతో మన బాధ్యత అయిపోతుందని అనుకొంకుండా గంజాయిని విక్రయించే వారిని గుర్తించి అరెస్టు చేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా అక్రమ ఇసుక రవాణాపై స్టేషన్ అధికారులు కఠినంగా వ్యవహరించాలని, ఎవరైన ఆలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని సీపీ సన్ ప్రీత్ సింగ్ హెచ్చరించారు. అలాగే రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అధికారులు ద□ష్టి పెట్టాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, కవిత, శుభంనాగ్‌తో పాటు అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# బాలవికాస సేవలు అభినందనీయం

**● ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు**




**వరంగల్ వాయిస్, కాజీపేట :** "ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న" అన్న మదర్ థెరిస్సా సూక్తిని బాలవికాస సంస్థ నిజం చేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు కొనియాడారు. కాజీపేటలో నిర్వహించిన 'బాలవికాస తాగునీటి శుద్ధీకరణ పథక కమిటీల మహాసభ'కు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. దేశంలోని పలు రాష్ట్రాల్లో బాలవికాస చేపడుతున్న స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు సమాజ అభ్యున్నతికి ఎంతో దోహదపడుతున్నాయని ప్రశంసించారు. ముఖ్యంగా గ్రామాల్లో చెరువుల పూడికతీత, పర్యావరణ పరిరక్షణ మరియు స్వచ్ఛమైన తాగునీటిని అందించడంలో ఈ సంస్థ పాత్ర అద్భుతమని పేర్కొన్నారు. తాను పోలీస్ శాఖలో ఉన్నతాధికారిగా విధులు నిర్వహించిన సమయంలో, బాలవికాస సంస్థతో కలిసి అనేక గ్రామాల్లో తాగునీటి పథకాల ఏర్పాటుకు కృషి చేసిన సందర్భాలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. భవిష్యత్ తరాలకు కలుషితం లేని స్వచ్ఛమైన నీటిని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం తమ స్వగ్రామంలో కూడా బాలవికాస సహకారంతో తాగునీటి శుద్ధీకరణ కేంద్రం ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజల ఆరోగ్యం కాపాడటంలో పరిశుభ్రమైన నీరు, పర్యావరణం కీలకమని స్పష్టం చేస్తూ, సంస్థ ప్రతినిధులను మనస్ఫూర్తిగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలవికాస ఈడీ శౌరెడ్డి, జలవికాస చైర్మన్ లూర్తు కుమార్ రెడ్డి, డైరెక్టర్లు ప్రతాప్ రెడ్డి, సురేష్ రెడ్డి, బోర్డు సభ్యులు, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, రజాలి, మానస, కాంగ్రెస్ నాయకులు కర్ర హరీష్ రెడ్డి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## 108కి ఫోన్ రాగానే స్పందించాలి

**జిల్లా మేనేజర్ మండ శ్రీనివాస్**



**వరంగల్ వాయిస్, శాయంపేట :** ఆపదలో ఉన్న వారికి 108 సేవలు ప్రాణదాతలని, కాల్ వచ్చిన వెంటనే సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన స్పందించాలని 108 సేవల జిల్లా మేనేజర్ మండ శ్రీనివాస్ అన్నారు. శనివారం శాయంపేట మండల కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా అంబులెన్స్‌లోని అత్యవసర మందులు, వైద్య పరికరాల పనితీరును శ్రీనివాస్ నిశితంగా పరిశీలించారు. మందుల కాలపరిమితి, రిజిస్టర్లను తనిఖీ చేసి, పరికరాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రమాద స్థలికి చేరుకున్న వెంటనే ప్రాథమిక చికిత్స అందించి, బాధితులను సురక్షితంగా ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చడమే ప్రథమ కర్తవ్యమని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. పెరుగుతున్న ఎండల నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, ఈ క్రమంలో అంబులెన్స్‌లో తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, గ్లూకోజ్, ఐస్ ప్యాక్‌లను అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. ఎండాకాలంలో వచ్చే అత్యవసర కేసుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత జనవరి, ఫిబ్రవరి మాసాల్లో సుమారు 150 అత్యవసర కేసుల్లో సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడినందుకు 108 సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈఎంటీ కందకట్ల సుధారాణి, పైలెట్ మండ కేదారి తదితరులు పాల్గొన్నారు.

## కివిలో వైజ్ఞానిక, సాంస్కృతిక జాతర

**ఆకట్టుకున్న 230 ప్రదర్శనలు**



**వరంగల్ వాయిస్, వరంగల్:** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అండర్ రైల్వే ప్రాంతంలోని కివి పాఠశాలలో 'సైన్స్ అండ్ కల్చరల్ ఎగ్జిబిషన్' శనివారం అత్యంత వైభవంగా జరిగింది. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, శాస్త్రీయ దృక్పథాన్ని వెలికితీసేలా ఈ ప్రదర్శన సాగింది. కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపల్ దాసి సతీష్ మూర్తి ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన సుమారు 230 సైన్స్ ఎగ్జిబిట్లను ఆయన తిలకించి, వారి మేధస్సును అభినందించారు. నిత్యజీవితంలో సైన్స్ ప్రాధాన్యతను చాటిచెప్పేలా విద్యార్థులు తయారు చేసిన నమూనాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేశాయి. సైన్స్‌తో పాటు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ద్వాదశ జ్యోతిర్లింగాలు, నవదుర్గల రూపాలను విద్యార్థులు ప్రదర్శించి ఆధ్యాత్మికతను చాటారు. తెలంగాణ విశిష్ట సంస్కృతిని ప్రతిబింబించేలా రూపొందించిన నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అన్నదేవర ప్రవీణ్ కుమార్, పాఠశాల డైరెక్టర్ దాసి రజిని, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభను చూసి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# ఉపాధ్యాయుల వేతనం దేశ భవిష్యత్తుకు పెట్టుబడి

**◆ విద్యా కమిషన్ నివేదికపై పీఆర్టీయూ టీఎస్ ఆగ్రహం**





**వరంగల్ వాయిస్, నడికూడ:** తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన 'ఎడ్యుకేషన్ పాలసీ ఫర్ తెలంగాణ–2026' నివేదికలోని అంశాలపై ఉపాధ్యాయ లోకం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది. ఉపాధ్యాయుల వేతనాలు మార్కెట్ ప్రమాణాల కంటే ఎక్కువగా ఉన్నాయనే వ్యాఖ్యానం పూర్తిగా అనుచితమని, వాస్తవ విరుద్ధమని పీఆర్ టీయూ టీఎస్ నడికూడ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అచ్చ సుదర్శన్, కటుకోజ్వల సతీష్ ఒక ప్రకటనలో ఖండించారు. సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే ఉపాధ్యాయుల జీతాలను 'అత్యధికం' అని పేర్కొనడం వారి కృషిని అవమానించడమేనని నేతలు మండిపడ్డారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు ఉండాలని, గౌరవప్రదమైన జీతభత్యాలు ఉన్నప్పుడే ప్రతిభావంతులు ఈ వృత్తిలోకి వస్తారని వారు స్పష్టం చేశారు. సీనియారిటీ ప్రాతిపదికన కాకుండా ఇతర పారామీటర్ల ద్వారా పదోన్నతులు కల్పిస్తామనడం సర్వీస్ రూల్స్ కు విరుద్ధమని వారు పేర్కొన్నారు. దాదాపు రెండు దశాబ్దాలుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు ఈ నిర్ణయం గొడ్డలిపెట్టు లాంటిదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుల పోస్టుల్లో 50 శాతం నేరుగా నియామకం ద్వారా భర్తీ చేయాలనే ప్రతిపాదనను పీఆర్టీయూ టీఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులే పాఠశాలను సమర్థవంతంగా నడపగలరని, ప్రస్తుతం ఉన్నట్లుగా కేవలం పదోన్నతుల ద్వారానే ఈ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యా కమిషన్ ఇచ్చిన నివేదికలోని ఉపాధ్యాయ వ్యతిరేక అంశాలను వెంటనే తొలగించాలని, ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉపాధ్యాయుల పక్షాన పోరాటాలు తప్పవని హెచ్చరించారు.

## తేజస్విలో అలరించిన సైన్స్ ఎక్స్‌పో

**విద్యార్థుల మేధస్సుకు నిదర్శనం**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక ప్రశాంత్ నగర్‌లోని తేజస్వి (సీబీఎస్ఈ) హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు తమ సృజనాత్మకతకు పదును పెట్టి రూపొందించిన వినూత్న నమూనాలు శాస్త్ర సాంకేతిక రంగాలపై వారికున్న ఆసక్తిని చాటిచెప్పాయి. ఈ ప్రదర్శనలో విద్యార్థులు ప్రస్తుత సమాజానికి అవసరమైన వివిధ అంశాలపై ప్రాజెక్టులను రూపొందించారు. ప్లాస్టిక్ నివారణ, ప్రకృతిని కాపాడుకునే మార్గాలు, సౌర శక్తి, విండ్ ఎనర్జీ వినియోగంపై నమూనాలు, స్మార్ట్ సిటీ నమూనాలు, ఆధునిక వ్యవసాయ సాంకేతికత, ప్రతి ప్రాజెక్టు వెనుక ఉన్న శాస్త్రీయ దృక్పథాన్ని విద్యార్థులు సందర్శకులకు స్పష్టంగా వివరించి మెప్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ ఎక్స్‌పోకు తల్లిదండ్రులు, ఇతర పాఠశాలల విద్యార్థులు భారీగా తరలివచ్చారు. చిన్నారుల మేధస్సును చూసి మురిసిపోయిన సందర్శకులు, ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తు శాస్త్రవేత్తలను తయారు చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని కొనియాడారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించిన పాఠశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ కళ్యాణి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థులు ముందంజలో ఉండాలని ఆకాంక్షిస్తూ, సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం


**భూమి పూజ చేసిన సర్పంచ్**



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం గ్రామ సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ లబ్ధిదారుల సమక్షంలో ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సొంతింటి కలను నిజం చేస్తోందని అన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, గడువులోగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా గ్రామ పంచాయతీ కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి దొంతుల కరుణాదేవి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అడ్వొకేట్ ప్రొటెక్షన్ బిల్లుకు సీఎం సానుకూలత

**బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** న్యాయవాదుల రక్షణ కోసం ప్రతిపాదించిన 'అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్' బిల్లును త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని కోరుతూ వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలుస సుధీర్ శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ, న్యాయవాదుల భద్రతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ బిల్లును ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. న్యాయవాదుల చిరకాల డిమాండ్‌పై సానుకూలంగా స్పందించినందుకు వరంగల్ జిల్లా న్యాయవాద సంఘం తరపున ముఖ్యమంత్రికి వలుస సుధీర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రపంచాన్ని నడిపించే శక్తి సైన్స్




**వరంగల్ వాయిస్, జనగామ :** సైన్స్ అనేది మన దైనందిన జీవితంలో అత్యంత కీలకమైన అంశమని, ఈ ప్రపంచాన్ని శాసిస్తూ నడిపించే శక్తి విజ్ఞాన శాస్త్రానికే ఉందని జనగామ ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సీతారాం పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శనివారం కళాశాల ఆవరణలో 'మేరా యువభారత్' వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, సూపరిండెంట్ బానోత్ దేవిలాల్ ఆదేశాల మేరకు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంగా తయారు చేసిన వివిధ రకాల సైన్స్ ఎగ్జిబిట్లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సోలార్ పవర్ ఇరిగేషన్, ఎర్త్‌క్వేక్ అలారం, ఎయిర్ పొల్యూషన్ కంట్రోల్ నమూనాలను విద్యార్థులు ప్రదర్శించి, వాటి పనితీరును వివరించారు. ప్రిన్సిపాల్ సీతారాం మాట్లాడుతూ ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మక ఆలోచనా తత్వం పెరుగుతాయని అన్నారు. నోబెల్ విజేత సర్ సి.వి. రామన్ పరిశోధనల నుంచి ప్రేరణ పొంది, విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలని ఆయన పిలుపునిచ్చారు. సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి: ఎం. సౌమ్య, ద్వితీయ బహుమతి: సింగారపు రమ్య, తృతీయ బహుమతి: భాగ్యశ్రీలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పరమేశ్వర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ మండ రాజేష్ గౌడ్, ఫిజిక్స్ విభాగాధిపతి ఆయుబ్ ఖాన్, అధ్యాపకులు పావని, ముంతాజ్, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ ఆంజనేయులుకు ప్రమాదం

**పరామర్శించిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, జనగామ :** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్ట్ చిటుకుల ఆంజనేయులును భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి శనివారం పరామర్శించారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ కె ఆసుపత్రికి చేరుకున్న ఎంపీ, ఆంజనేయులు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇటీవల లింగాల ఘణపురం మండలం వడిచర్ల, కొత్తపల్లి గ్రామాల మధ్య బైక్‌పై వెళ్తున్న ఆంజనేయులును అతివేగంతో వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. "ఏమాత్రం అధైర్యపడొద్దు, మీకు ప్రభుత్వం తరపున పూర్తి అండదండలు ఉంటాయి" అని బాధితుడికి ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చులకు సంబంధించి దాదాపు రూ.5 లక్షల వరకు ప్రభుత్వం ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎంపీ స్వయంగా ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలను తెలుసుకున్నారు. బాధితుడికి సంబంధించిన ఎక్స్‌రే రిపోర్టులను క్షుణ్ణంగా పరిశీలించి, మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. అనంతరం ఆంజనేయులు కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారికి ధైర్యం చెప్పారు.

# రోడ్డు పనులకు మార్కింగ్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** పట్టణంలోని ముత్యాలమ్మ గుడి దగ్గర నుంచి జిల్లా పరిషత్ స్కూల్ మీదుగా బుద్ధారం వెళ్లే బైపాస్ రోడ్డు వరకు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ నిరంజన్ తెలిపారు.శనివారం రోడ్డు మార్గంలో 36 అడుగుల మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు వివిధ ప్రదేశాల్లో మార్కింగ్ చేపట్టారు. పట్టణాభివృద్ధిలో భాగంగా జరిగే ఈ రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ కోండేటి రాజకుమారి హరి నాథ్ బాబు, వైస్ చైర్ పర్సన్ మాధ లావణ్య శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ స్వర్ణ హరి కృష్ణ, టౌన్ ప్లానింగ్ అధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి

**◆ తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇళ్ల స్థలాల కోసం పేదలు ఇంకెన్నాళ్లు నిరీక్షించాలని, ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న వారందరికీ తక్షణమే పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ మండలం గుండ్లసింగారంలోని సురవరం సుధాకర్ రెడ్డి కాలనీని పార్టీ జిల్లా నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం కాలనీ వాసులతో జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలకు నిలువ నీడ లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా, ఇళ్ల స్థలాలు మరియు పక్కా ఇళ్ల నిర్మాణ హామీని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ భూముల్లో గుడిసెలు, ఇళ్లు వేసుకుని నివసిస్తున్న పేదలకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలి. అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పేద ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలి. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, మండల కార్యదర్శి ఎన్.ఏ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్ పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు మాదసి కల్యాణ్, గాదె రాజన్న, గాదె మొగిలి, కట్కూరి కృష్ణ, నాయకులు పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, గుడికందుల శివ, మామునూరి దామోదర్, వందలాది మంది కాలనీ వాసులు పాల్గొన్నారు.

# బీసీ రక్షణ చట్టం తేవాల్సిందే

- అసెంబ్లీ సాక్షిగా నిర్ణయం తీసుకోవాలి
- తాటిపాముల వెంకట్రాములు డిమాండ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్రంలో బీసీలు, బడుగు బలహీన వర్గాలపై అగ్రవర్ణ అహంకారుల దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, వారిని రక్షించేందుకు తక్షణమే 'బీసీ రక్షణ చట్టం' తీసుకురావాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం అభివృద్ధి చెందుతున్నా, నేటికీ కుల వివక్ష, మూఢనమ్మకాలు విలయతాండవం చేయడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. కులవృత్తిదారులు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే కుల బహిష్కరణలతో వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతరలో రజక కుటుంబంపై జరిగిన దాడిలో రెండు నెలల పసికందు మరణించడం అత్యంత అమానుషమని పేర్కొన్నారు. బాధితులపైనే ముందుగా కేసులు నమోదు చేసిన పోలీసుల తీరును తప్పుబట్టారు. నిందితులపై హత్య కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సహాయంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడానికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలోనే ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, రానున్న అసెంబ్లీ సమావేశాల్లోనే దీనిపై బిల్లు ప్రవేశపెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ సాయి విజ్ఞాన భారతిలో ఘనంగా సైన్స్ డే

**విద్యార్థుల వినూత్న ప్రదర్శనలు**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 14వ డివిజన్ మణికంఠ కాలనీలో గల శ్రీ సాయి విజ్ఞాన భారతి హైస్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. విద్యార్థుల్లో వైజ్ఞానిక స్పృహను పెంపొందించేలా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాల మేధావులు రూపొందించిన సైన్స్ ఎగ్జిబిట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సామల శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత సర్ సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 1928 ఫిబ్రవరి 28న 'రామన్ ఎఫెక్ట్' ద్వారా కాంతి పరిక్షేపణ సిద్ధాంతాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు సి.వి. రామన్ అని కొనియాడారు. దేశంలో సైంటిఫిక్ టెంపర్, రీసెర్చ్ మరియు ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించడానికి ప్రతి ఏటా ఈ వేడుకలను జరుపుకుంటున్నామని ఆయన తెలిపారు. విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలతో తయారు చేసిన సైన్స్ ఎగ్జిబిట్లను, నమూనాలను శశిధర్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. విద్యార్థులు తమ ప్రాజెక్టుల వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాలను వివరించిన తీరును ఆయన అభినందించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం తరపున బహుమతులను అందజేశారు. విద్యార్థులంతా శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన పెంచుకొని, భవిష్యత్తులో గొప్ప ఆవిష్కరణలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు ఎస్. స్వాతి, ఎం.రాధ, రిజ్వానా, ఫాతిమా, శ్రావణి, లతా శ్రీ, చందన, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# సీఎం రేవంత్ రెడ్డి బీజేపీ, టీడీపీలకు కోవర్టు

**◆ మాల సంఘాల జేఏసీ ధ్వజం**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అశాస్త్రీయమైన ఎస్సీ వర్గీకరణ ద్వారా మాల సామాజిక వర్గాన్ని అణచివేసే కుట్ర చేస్తున్నారని, ఆయన బీజేపీ, టీడీపీలకు కోవర్టుగా వ్యవహరిస్తున్నారని మాల సంఘాల జేఏసీ నేతలు తీవ్రంగా ఆరోపించారు. శుక్రవారం హనుమకొండలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జేఏసీ రాష్ట్ర నాయకులు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్ల వల్ల విద్యా, ఉద్యోగ రంగాల్లో మాలలు తీవ్రంగా నష్టపోతున్నారని జేఏసీ రాష్ట్ర చైర్మన్ మందల భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. మాలలను అణచివేయాలని చూస్తే కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తామని మాల సంఘాల విద్యార్థి జేఏసీ రాష్ట్ర చైర్మన్ మదాసి రాహుల్ రావు హెచ్చరించారు. రిజర్వేషన్ల తొలగింపు కుట్రలను సహించబోమని, ద్రోహం చేసిన రేవంత్ రెడ్డిని ఏ పార్టీలో ఉన్నా వెంటాడి ఓడిస్తామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నడుస్తూ మాలలకు అన్యాయం చేస్తున్నారని గౌరవ అధ్యక్షులు చెరుకు రామచందర్ విమర్శించారు. కాంగ్రెస్ అధిష్టానం ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వర్గీకరణ అంశాన్ని పునఃసమీక్షించకపోతే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు బండి అశోక్, కంకణాల సంతోష్, దండు మోహన్, పానుగంటి లక్ష్మీనారాయణ, దండ్రి శ్రీనివాస్, గురిమిల్ల రాజు, శేషాద్రి నాగులు, కునముల్ల అనిత, దావా రవి తదితరులు పాల్గొన్నారు.

# కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే 80% ఉద్యోగాలివ్వాలి

■ దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో స్థానిక నిరుద్యోగ యువతకు 80 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, లేనిపక్షంలో గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాడుతామని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ హెచ్చరించారు. శనివారం కాజీపేట చౌరస్తాలో నిర్వహించిన 'కొలువుల కోసం కొట్లాట' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. 1982లో ప్రజల పోరాటంతో మంజూరైన కోచ్ ఫ్యాక్టరీని గత పాలకులు విస్మరించారని మండిపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలో జరిగిన తెలంగాణ ఉద్యమ ఫలితంగానే నేడు కోచ్ ఫ్యాక్టరీ సాకారమవుతోందని గుర్తు చేశారు. పునర్విభజన చట్టం ప్రకారం కేంద్రం బాధ్యత వహించాల్సి ఉన్నా, బీజేపీ ప్రభుత్వం అనేకమార్లు అడ్డుతగిలిందని, చివరకు లాతూర్‌కు ఫ్యాక్టరీని తరలించే కుట్రలు చేసిందని విమర్శించారు. కోచ్ ఫ్యాక్టరీలో స్థానిక యువతకే 80 శాతం ఉద్యోగాలు కేటాయించాలి. ఫ్యాక్టరీ కోసం భూములు త్యాగం చేసిన కుటుంబాలకు తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలి. కాజీపేటను తక్షణమే రైల్వే డివిజన్‌గా ప్రకటించాలి. రైల్వేలో వార్తక, వ్యాపార నిర్వహణలో స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయకూడదు. ఓరుగల్లు గడ్డకు తిరగబడే నైజం ఉందని, స్థానిక నిరుద్యోగులకు అన్యాయం జరిగితే సహించేది లేదని వినయ్ భాస్కర్ స్పష్టం చేశారు. స్థానిక ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇచ్చేలా జీవో తీసుకురావాలని డిమాండ్ చేశారు. హక్కులు సాధించే వరకు విశ్రమించబోమని, అవసరమైతే నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి మరీ ఉద్యోగాలు సాధించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

# శాస్త్రీయ దృక్పథంతోనే ప్రగతి సాధ్యం



**వరంగల్ వాయిస్, ఖిలావరంగల్ :** నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత ఘనంగా జరిగాయి. సైన్స్ ఉపాధ్యాయురాలు ఎం.రమ్య పర్యవేక్షణలో విద్యార్థులు రూపొందించిన వినూత్న ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ పంచకం నర్సయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతీయ శాస్త్రవేత్త సర్ సి.వి. రామన్ 'రామన్ ఎఫెక్ట్'ను కనుగొని నోబెల్ బహుమతి సాధించిన రోజు మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన పెంచుకోవాలని, సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు తమ సృజనాత్మకతకు పదును పెట్టి విభిన్న రకాల సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రతి ప్రాజెక్టు వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాన్ని విద్యార్థులు వివరించిన తీరును కరస్పాండెంట్ అభినందించారు. అనంతరం తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శనలను తిలకించి విద్యార్థులను ప్రోత్సహించారు. ఉపాధ్యాయురాళ్లు కె.అశ్విని, ఎన్.నర్మద, కె.దివ్యశ్రీ, అఫ్రీన్, ఎ.సుష్మిత, కె.గౌతమి, జి.లీనా శ్రీ, జి.బాల ప్రభ, పి.స్రవంతి, పి.సుప్రియ, కె.కస్తూరి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# 40 ఏళ్ల నాటి మధుర స్మృతులు

టీచర్‌ను కలిసి మురిసిపోయిన నాటి విద్యార్థులు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** కాలం వేగంగా కదిలినా, అక్షరాలు నేర్పిన గురువుల పట్ల ఉన్న గౌరవం మాత్రం చెక్కుచెదరలేదు. సరిగ్గా 40 ఏళ్ల క్రితం తాము నేర్చుకున్న సైన్స్ పాఠాలు, ఆ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ డోర్నకల్ జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థులు తమ ప్రియతమ ఉపాధ్యాయురాలిని కలిసి కృతజ్ఞతలు చాటుకున్నారు. డోర్నకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థినులు, శనివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తమ సైన్స్ టీచర్ భారతి నివాసానికి చేరుకున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత తమను వెతుక్కుంటూ వచ్చిన విద్యార్థినులను చూసి టీచర్ భారతి భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ గురువును శాలువాతో ఘనంగా సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు. "అప్పట్లో టీచర్ బోధించిన సైన్స్ పాఠాలే మా జీవితాలకు పునాది వేశాయి. ఆ క్రమశిక్షణ, బోధన వల్లే ఈరోజు మేము వివిధ రంగాల్లో ఉద్యోగులుగా స్థిరపడ్డాము" అని పాత విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. నాటి స్కూల్ రోజులను, తోటి మిత్రులను గుర్తు చేసుకుంటూ వారు కొద్దిసేపు సందడి చేశారు. ఈ ఆత్మీయ కలయికలో బిక్కసాని జ్యోతి, ఈశ్వరి, వరలక్ష్మి, శారమ్మ, నీరజ, ఎన్. పద్మ, పద్మ, విజయ, స్వర్ణకుమారి, సుధారాణి, రమాదేవి, రాజమణి, వాణి కుమారి తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ దృక్పథంతో మెరిసిన విద్యార్థులు




**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని డోర్నకల్ మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు అత్యంత వైభవంగా జరిగాయి. 'స్కినోవా-26'పేరుతో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టి రూపొందించిన వినూత్న నమూనాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేశాయి. మండలంలోని కన్నెగుండ్ల, ముల్కలపల్లి, డోర్నకల్ ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఈ సైన్స్ ఎగ్జిబిషన్లను మండల విద్యాధికారి లక్ష్మా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, తార్కిక ఆలోచనా శక్తిని వెలికితీయడానికి ఇటువంటి ప్రదర్శనలు ఒక గొప్ప వేదికని కొనియాడారు. సర్ సీవీ రామన్ 'రామన్ ఎఫెక్ట్' ఆవిష్కరణను స్మరిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా రాకెట్ నమూనా, సబ్ మెరైన్స్ (జలాంతర్గాములు),ఎలక్ట్రిక్ బెల్, వాల్కనో (అగ్నిపర్వతం), విండ్ మిల్ (గాలిమర) వంటి ప్రదర్శనలు దైనందిన జీవితంలో విజ్ఞాన శాస్త్ర ప్రాధాన్యతను చాటిచెప్పాయి. భారతదేశానికి నోబెల్ బహుమతి తెచ్చిపెట్టిన సీవీ.రామన్ స్ఫూర్తితో విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎంఈఓ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాధవరావు, కోయిల రాజేశ్వర్, వెంకన్న, శ్రీనివాస్, రామకృష్ణ, దస్తగీర్, శేఖర్, లోకేందర్ రెడ్డి, నరేందర్, నాగమణి, రాజేశ్వరి, రామ్మూర్తి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# టైలర్‌కు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ప్రపంచ దర్జీ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ రామన్నపేటలోని డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీనియర్ దర్జీ వృత్తిదారుడికి ఘన సన్మానం జరిగింది. గత 50 ఏళ్లుగా దర్జీ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న రామన్నపేట నివాసి ఏ. వెంకటనారాయణను ట్రస్ట్ ప్రతినిధులు శనివారం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ఒకప్పుడు వెలుగువెలిగిన దర్జీ వృత్తి, నేడు రెడీమేడ్ దుస్తుల రాకతో తీవ్ర సంక్షోభంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అర దశాబ్ద కాలంగా వరంగల్ చౌరస్తాలోని ఒక చిన్న మడిగలో కష్టపడుతున్న వెంకటనారాయణ వంటి వృత్తిదారుల జీవనం నేడు భారంగా మారిందని పేర్కొన్నారు. సన్మాన గ్రహీత వెంకటనారాయణ మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం తాము క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం తమను గుర్తించి ఆదుకోవాలని విన్నవించారు. ఆర్గనైజర్ శ్రవణ్, మెంబర్స్ రాజేష్, శ్రీపతి కుమార్, పుప్పాల మోహన్, ఎల్లయ్య, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# ముగిసిన వార్డు సభ్యుల శిక్షణ తరగతులు

• పంచాయతీ అభివృద్ధిపై అవగాహన



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల పరిధిలోని కొత్తగా ఎన్నికైన వార్డు సభ్యులకు ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం శనివారంతో విజయవంతంగా ముగిసింది. ఈ నెల 24 నుంచి 28 వరకు జరిగిన ఈ శిక్షణలో ప్రజా ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు.మండలంలోని నర్సింహులపల్లి, గట్టుకానిపర్తి, మాందారిపేట, మైలారం, పత్తిపాక, శాయంపేట, హుస్సేన్ పల్లి, సూర్యంపేట, చిన్నకోడెపాక, పెద్ద కోడెపాక, ప్రగతి సింగారం తదితర గ్రామ పంచాయతీలకు చెందిన వార్డు సభ్యులకు ఈ సందర్భంగా కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీలకు వచ్చే వివిధ రకాల నిధులు, నిధుల వినియోగం, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, వార్డు సభ్యుల బాధ్యతలు, అధికారాల గురించి నిపుణులు వివరించారు. శిక్షణ ముగింపు సందర్భంగా శనివారం నర్సింహులపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వలస తిరుపతి చేతుల మీదుగా శిక్షణ పొందిన వార్డు సభ్యులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సింహులపల్లి ఉప సర్పంచ్ ముస్కు రాజేందర్, వార్డు సభ్యులు యార రజిత, మహ్మద్ రహీం మున్నీసా, గడ్డె రాజు, పెంతల కృష్ణ, ఉస్నగిరి శ్రీకాంత్, పెంతల లత తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేయండి



**వరంగల్ వాయిస్, రఘునాథ్ పల్లి :** మాజీ మంత్రి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తన్నీరు హరీష్ రావును శనివారం జనగామ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రఘునాథపల్లిమండల సీనియర్ నాయకులు ఆరూరి రాజశేఖర్ కలిశారు. పార్టీ ఉద్యమకారుడు ఆరూరి రాజశేఖర్ పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్నారని.. రాజశేఖర్ ను అభినందించారు.ఈ కార్యక్రమంలో మాదారం గ్రామ సర్పంచ్ ఆరూరి సరిత మల్లేష్ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా శాస్త్రవేత్తలతోనే 'వికసిత్ భారత్' సాధ్యం

**◆ కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో మహిళా శాస్త్రవేత్తల పాత్ర అత్యంత కీలకమని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఉద్ఘాటించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కేయూ సెనేట్ హాల్‌లో "విమెన్ ఇన్ సైన్స్: క్యాటలైజింగ్ వికసిత్ భారత్" అనే అంశంపై ఒకరోజు ప్రత్యేక కార్యశాల నిర్వహించారు. క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి.మనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ రంగాల్లో మహిళలు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని రిజిస్ట్రార్ పిలుపునిచ్చారు. జానకి అమ్మాళ్, టెస్సీ థామస్, అసిమా ఛటర్జీ వంటి మహోన్నత మహిళా శాస్త్రవేత్తల స్ఫూర్తితో యువతులు పరిశోధన రంగంలోకి అడుగుపెట్టాలని కోరారు. ఎటువంటి వివక్ష లేకుండా మహిళా పరిశోధకులను ప్రోత్సహించినప్పుడే దేశం స్వయం సమృద్ధి సాధిస్తుందని ఆయన స్పష్టం చేశారు. గౌరవ అతిథిగా విచ్చేసిన సైన్స్ విభాగాల డీన్ జి.హనుమంత్ మాట్లాడుతూ.. నిత్య జీవితంలో ప్రతి అంశాన్ని శాస్త్రీయ దృక్పథంతో చూడాలని సూచించారు. పరిమిత వసతులతోనే అంతర్జాతీయ స్థాయి పరిశోధనలు చేసిన నోబెల్ విజేత సీవీ రామన్ కృషిని ఆయన కొనియాడారు. జేఎన్‌టీయూ హైదరాబాద్ ఆచార్యులు ఆచార్య శశికళ "మైక్రోబయల్ డైవర్సిటీ"పై ప్రసంగిస్తూ.. ప్రకృతి సమతౌల్యంలో బ్యాక్టీరియా పాత్రను వివరించారు. పిల్లలు మట్టిలో ఆడుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని, అయితే స్క్రీన్ సమయాన్ని (మొబైల్ వినియోగం) తగ్గించుకోవాలని హితవు పలికారు. సీఎస్ఐఆర్–ఐఐసీటీ శాస్త్రవేత్త డా.శ్రీప్రియ వేదాంతం మాట్లాడుతూ.. సుస్థిర భారత నిర్మాణం మహిళా శాస్త్రవేత్తల నాయకత్వంపైనే ఆధారపడి ఉందన్నారు. కల్పనా చావ్లా, గగన్‌దీప్ కాంగ్ వంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని, గ్రీన్ ఎనర్జీపై దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతి డా.మంజుల, వైస్ ప్రిన్సిపాల్ డా.కే.మమత, బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సైన్స్ ప్రయోగాలు, వ్యాసరచన, క్విజ్, పోస్టర్ మేకింగ్ పోటీలు, సైన్స్ మేళా, ఎగ్జిబిషన్ నిర్వహించగా విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సైన్స్ ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థినులు శాస్త్రీయ నమూనాలు, ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్అపర్ణ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

## బాలల న్యాయమండలి ప్రారంభం



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జిల్లాలో బాలనేరస్థుల కేసుల వేగవంతమైన విచారణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాలల న్యాయ మండలి శనివారం ప్రారంభమైంది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ రమేష్ బాబు మండలిని ప్రారంభిస్తూ, 18 ఏళ్ల లోపు బాలలకు శిక్ష విధించడం కంటే మార్పు, పునరావాసం ముఖ్య లక్ష్యం అని స్పష్టం చేశారు. ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ గుంటి జ్యోత్స్న ఆధ్వర్యంలో ఈ మండలి కార్యకలాపాలు కొనసాగనున్నాయి. బాలల కేసుల్లో సున్నిత దృక్పథంతో విచారణ జరిపి, అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందించనున్నారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ ఏ కార్యదర్శి ఏ.నాగరాజు, బోర్డు సభ్యులు మేరుగు సుభాష్, ప్రొబేషన్ అధికారి రమణ మూర్తి, సంక్షేమ అధికారి మల్లేశ్వరి, ఏ.ఓ అనిత వాణి, బార్ అసోసియేషన్ కార్యదర్శి శ్రవణ్ రావు, ఉపాధ్యక్షులు బల్లా మహేందర్, ప్రతినిధులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్, జీపీ, న్యాయవాదులు, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీనివాస్ కోర్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్‌కు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ విశ్వవిద్యాలయం న్యాయశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి, ప్రస్తుతం పోలీస్ శాఖలో ఉన్నతాధికారిగా సేవలందిస్తున్న బోనాల కిషన్ కు డాక్టరేట్ (పీహెచ్ డీ) లభించింది. ఈ మేరకు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల అధికారికంగా ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ బోనాల కిషన్ "క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ ఇన్ ఇండియా – ఏ స్టడీ విత్ రిఫరెన్స్ టు లా అండ్ స్ట్రాటజీస్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ విట్‌నెస్" (భారతీయ నేర శిక్షాస్మృతి – సాక్షుల రక్షణ కోసం చట్టాలు, వ్యూహాలపై అధ్యయనం) అనే కీలక అంశంపై తన పరిశోధనను పూర్తి చేశారు. న్యాయశాస్త్ర విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య వై.పద్మజ రాణి పర్యవేక్షణలో ఆయన ఈ పరిశోధనను విజయవంతంగా ముగించారు. హనుమకొండకు చెందిన డాక్టర్ బోనాల కిషన్ ప్రస్తుతం అడిషనల్ ఎస్పీ హోదాలో ఉన్నారు. ఆయన ప్రస్తుతం హనుమకొండలోని టీజీఎన్పీడీసీఎల్ లో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ఎంతో బిజీగా ఉంటూనే, న్యాయవ్యవస్థలో అత్యంత కీలకమైన సాక్షుల రక్షణపై ఆయన చేసిన కృషిని పలువురు కొనియాడుతున్నారు. అడిషనల్ ఎస్పీగా ఉంటూ డాక్టరేట్ సాధించిన బోనాల కిషన్‌ను విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది, తోటి పరిశోధకులు, విద్యార్థులు ఘనంగా అభినందించారు. ఆయన చేసిన ఈ పరిశోధన భవిష్యత్తులో న్యాయ, పోలీస్ వ్యవస్థలకు ఎంతో దోహదపడుతుందని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

## శాస్త్రీయ దృక్పథంతోనే దేశ పురోగతి



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ధర్మసాగర్ మండల కేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్ బాలుర పాఠశాలలో శనివారం వైజ్ఞానిక వేడుకలు అత్యంత సృజనాత్మకంగా నిర్వహించబడ్డాయి. విద్యార్థుల్లో జిజ్ఞాసను పెంపొందించి, వారిని శాస్త్ర సాంకేతిక రంగాల వైపు మళ్లించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు సాగాయి. ఈ సందర్భంగా "వికసిత భారత్‌కు ప్రేరణగా మహిళలు విజ్ఞానంలో" అనే అంశంపై నిర్వహించిన సెమినార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశ నిర్మాణంలో మహిళా శాస్త్రవేత్తలు చేసిన కృషిని వివరిస్తూ, బాలికలు సైన్స్ రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వక్తలు పిలుపునిచ్చారు. దీంతో పాటు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, సైన్స్ క్విజ్ మరియు విజ్ఞాన నాటికలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సభను ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు, జన విజ్ఞాన వేదిక కార్యకర్త కె.బి. ధర్మ ప్రకాశ్ మాట్లాడుతూ.. విజ్ఞానం కేవలం ప్రయోగశాలలకు లేదా పాఠ్యపుస్తకాలకు మాత్రమే పరిమితం కాదని, అది మన వ్యవసాయం, పర్యావరణం, దైనందిన వృత్తుల్లోనూ నిబిడమై ఉందన్నారు. ఈ కార్యక్రమాలను జీవశాస్త్ర అధ్యాపకురాలు కవితా దేవి, భౌతిక శాస్త్ర అధ్యాపకుడు సురేష్ సమర్థవంతంగా నిర్వహించి సమన్వయం చేశారు. ఉపాధ్యాయులు రాజమ్మ, కిరణ్మయి వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికేట్లను అందజేసి వారిని ప్రోత్సహించారు. చివరగా, సమాజ హితం, పర్యావరణ పరిరక్షణకు విజ్ఞానాన్ని వినియోగిస్తామని విద్యార్థులందరూ చేసిన ప్రతిజ్ఞతో ఈ వేడుకలు ముగిశాయి.

## చిన్న ఆలోచనే గొప్ప ఆవిష్కరణకు పునాది

**ప్రిన్సిపాల్ జన్ను విజయ్ కుమార్**



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత ఘనంగా జరిగాయి. సైన్స్ విభాగం కన్వీనర్ వేముల రమేష్, ఫిజికల్ సైన్స్ అధ్యాపకులు చిప్ప రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ జన్ను విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి విషయాన్ని పరిశీలనాత్మకంగా, తర్కబద్ధంగా ఆలోచించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. "ఒక చిన్న ఆలోచనే రేపటి గొప్ప ఆవిష్కరణగా మారవచ్చు" అని ఆయన పేర్కొన్నారు. సమాజంలో ఉన్న మూఢనమ్మకాలను పారద్రోలి, సమస్యలకు సృజనాత్మకమైన శాస్త్రీయ పరిష్కారాలు కనుగొనాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. నూతన సాంకేతికతను నేర్చుకుని సమాజ ప్రగతికి వినియోగించాలని, పర్యావరణ సమస్యలపై అవగాహన పెంచుకుని స్థిరమైన అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. మహానుభావులైన శాస్త్రవేత్తల పట్టుదల, క్రమశిక్షణ మరియు పరిశోధనాసక్తిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రదర్శనలను తిలకించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

# కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి

**◆ చిట్యాల తహశీల్దార్ షేక్ ఇమామ్ బాబా**




**వరంగల్ వాయిస్, చిట్యాల :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. నోబెల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, విద్యార్థులు రూపొందించిన సైన్స్ ఎగ్జిబిట్లను అతిథులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల తహశీల్దార్ షేక్ ఇమామ్ బాబా మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే చదువుతో పాటు సైన్స్ పట్ల ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమాజంలోని మూఢనమ్మకాలను నమ్మవద్దని, 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా' ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని, గొప్ప కలలు కని వాటిని సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ రాజ్ మహమ్మద్ మాట్లాడుతూ.. సీవీ రామన్ 1928లో 'రామన్ ఎఫెక్ట్'ను కనుగొని, 1930లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి సాధించి భారతదేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. ఆయన గౌరవార్థం భారత ప్రభుత్వం 'భారతరత్న'తో సత్కరించిందని, 1987 నుంచి ప్రతి ఏటా ఫిబ్రవరి 28ని జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వైజ్ఞానిక నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తహశీల్దార్, గ్రామ సర్పంచ్, ఇతర అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సమావేశంలో చిట్యాల గ్రామ పంచాయతీ సర్పంచ్ తవటం లక్ష్మి అంతయ్య, ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు మైదం శ్రావ్య శ్రీకాంత్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# విష్ణు విన్యాసం మూవీ లీక్

## అందుకే త్వరగా విడుదల చేశాం

'విష్ణు విన్యాసం' మూవీ లీక్ అవడం వల్ల చాలా విషయాలు జరిగాయని అందుకే వారం గ్యాప్‌తో తన రెండు సినిమాలు విడుదల చేయాల్సి వచ్చిందని శ్రీవిష్ణు తెలిపారు. ఆయన కథానాయకుడిగా యదునాథ్ మారుతీరావు దర్శకత్వంలో రూపొందిన కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. నయన్ సారిక కథానాయిక. తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ మూవీ చక్కటి వినోదాన్ని పంచుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీవిష్ణు మాట్లాడారు. 'సినిమా లీక్ అవడం వల్ల షూటింగ్ హడావుడిగా అయిందన్నారు. స్క్రిప్ట్‌లో ఏమైనా మార్పులు చేశారా' అని అడగ్గా, 20 రోజుల పనిని ఏడు రోజుల్లో రాత్రి, పగలూ విరామం లేకుండా చేయాల్సి వచ్చింది. టీమ్ అంతా సహకారం అందించారు. అలా చేస్తేనే ఈ టైమ్‌కు రాగలిగాం. పూర్తి ప్లానింగ్ లేకుండా ప్రచార కార్యక్రమాలు మొదలుపెట్టాల్సి వచ్చింది. దానివల్లే రెండు సినిమాలు ఒకదాని తర్వాత ఒకటి వచ్చాయి. చెన్నై నుంచి ఈ సినిమాను లీక్ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశాం. దీనిపై కేసు నడుస్తోంది. మా నిర్మాతని బ్లాక్ మెయిల్ చేశారు. ఆయనను బెదిరిస్తూ వాళ్లు పెట్టిన సందేశాలు, ఛాంబర్‌కు మేము చేసిన ఫిర్యాదులు అన్నీ మా దగ్గర ఉన్నాయి. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై చర్చించాలి. ప్రతి రీల్‌కు నిర్మాతను బ్లాక్ మెయిల్ చేశారు. విడుదల ముందురోజు వరకూ ఇదంతా జరిగింది. ఆ విషయంలో నిర్మాత చాలా ఇబ్బందిపడ్డారు. అలాగని మమ్మల్ని ఆందోళనకు గురి చేయలేదు' అని శ్రీవిష్ణు తెలిపారు.




## రణబాలి నుంచి ఎందయ్యా సామి సాంగ్ విడుదల

టాలీవుడ్ కొత్త జంట రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందనలకి స్పెషల్ సర్ప్రైజ్‌ని ఇచ్చారు రణబాలి మేకర్స్. వీరిద్దరూ జంటగా రాహుల్ సంకృన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రణబాలి'. ఈ సినిమాలో విజయ్ 'రణబాలి'గా, రష్మిక 'జయమ్మ'గా నటిస్తున్నారు. ఇటీవల వివాహబంధంలోకి అడుగుపెట్టిన వీరికి చిత్రబృందం స్పెషల్ సర్ప్రైజ్ ఇస్తూ.. చిత్రంలోని రొమాంటిక్ మెలోడీ 'ఎందయ్య సామి' పాటను విడుదల చేశారు. ప్రముఖ సంగీత ద్వయం అజయ్`అతుల్ అందించిన ఈ పాట వినగానే ఆకట్టుకునేలా ఉంది. తెలుగులో 'ఎందయ్య సామి', తమిళంలో 'ఎదయ్యా సామి', హిందీలో 'ఓ మేరే సాజన' అంటూ ఐదు భాషల్లో ఈ పాటను విడుదల చేశారు. పాటలో విజయ్, రష్మికల మధ్య కెమిస్ట్రీ మునుపటి 'గీత గోవిందం' రోజులను గుర్తు చేస్తోందని అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.




## వెంకటప్పనాయుడుగా మోహన్ బాబు

కలెక్షన్ కింగ్ డాక్టర్ మోహన్ బాబు మరోసారి వెండితెరపై తన గంభీరమైన నటనతో అలరించబోతున్నారు. అజయ్ భూపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగపురం' అనే క్రేజీ ప్రాజెక్ట్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో మోహన్ బాబు పోషిస్తున్న 'వెంకటప్పయ్య నాయుడు' పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం నేడు విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో మోహన్ బాబు లుక్ ఎంతో పవర్ ఫుల్ గా, రాజసంతో ఉట్టిపడుతోంది. గర్వం, ధైర్యం కలగలిసిన ఒక గంభీరమైన పాత్రలో ఆయన కనిపించబోతున్నారని చిత్ర యూనిట్ పేర్కొంది. 'మహాసముద్రం', 'మంగళవారం' వంటి సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్న దర్శకుడు అజయ్ భూపతి, మోహన్ బాబును ఒక సరికొత్త కోణంలో చూపించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంతో సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని వెండితెరకి పరిచయం కాబోతుండగా.. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాశా థడాని హీరోయిన్‌గా నటిస్తుంది. ప్రముఖ నిర్మాతలు అశ్వినీదత్, జెమిని కిరణ్ ఈ చిత్ర నిర్మాణంలో పాలుపంచుకుంటున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నాడు.




## స్పిరిట్ నుంచి వివేక్ ఒబెరాయ్ లుక్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న హై రేంజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట'పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన విలన్ ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబేరాయ్ ఈ చిత్రంలో ప్రతినాయకుడిగా నటిస్తున్న సంగతి తెలిసిందే. 'వన్ బ్యాడ్ హ్యాబిట్ ఇన్ స్పిరిట్ మోడ' అనే ట్యాగ్‌తో విడుదల చేసిన పోస్టర్‌లో వివేక్ ఓబెరాయ్ నోట్లో సిగార్‌తో పవర్‌ఫుల్ యాక్షన్ లుక్‌లో కనిపించారు. పోస్టర్‌ను బట్టి ఆయన ఓ డాన్ పాత్రలో కనిపించనున్నట్లు అర్థమవుతోంది. అయితే అదే పోస్టర్‌లో వివేక్ పక్కన కనిపించిన యువతి ఎవరు? అనే చర్చ సోషల్ మీడియాలో మొదలైంది. ఆమె పేరు ఐశ్వర్య దేశాయ్. యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ నుంచి మార్కెటింగ్‌లో డిగ్రీ పూర్తి చేసిన ఇండో`అమెరికన్ నటి. బాలీవుడ్ చిత్రం 'గల్లీ బాయ'లో నటించిన ఆమె, 'ర్యాట్ ఇన్ ద కిచెన' అనే షార్ట్ ఫిల్మ్‌తో మంచి గుర్తింపు పొందారు. ఆ చిత్రానికి ఉత్తమ సహాయ నటిగా అవార్డు కూడా అందుకున్నారు. ఇప్పుడు 'స్పిరిట' చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. పోస్టర్‌లో వివేక్‌తో కలిసి కనిపించడం వల్ల సినిమాలో ఆమెకు కీలక పాత్ర ఉన్నట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క పోస్టర్‌తోనే ఆమెకు మంచి క్రేజ్ వచ్చింది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన త్రిప్తి డిమ్రీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, లుక్స్ ప్రేక్షకుల్లో గూస్‌బంప్స్ తెప్పించాయి.

# సంఘమిత్ర స్కూల్‌లో సైన్స్ సందడి

◆ **వినూత్న ఆవిష్కరణలతో బాల మేధావుల మేధోమథనం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని దేశాయిపేట రోడ్డులో గల సంఘమిత్ర హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత ఘనంగా జరిగాయి. పాఠశాల కరస్పాండెంట్ ఎం.వెంకటేశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డి.మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముందుగా నోబెల్ బహుమతి గ్రహీత సర్ సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎం.వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. 1928 ఫిబ్రవరి 28న సి.వి. రామన్ 'రామన్ ఎఫెక్ట్' ద్వారా కాంతి పరిక్షేపణ సిద్ధాంతాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని కొనియాడారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ సైన్స్ ఎగ్జిబిట్లను అతిథులు పరిశీలించి, వారి ప్రతిభను అభినందించారు.



ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రదర్శనలను తిలకించారు.

## గౌట్ స్కూల్‌లో సైన్స్ జాతర

**ప్రారంభించిన కార్పొరేటర్ మరుపల్ల రవి**

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** స్థానిక కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత ఉత్సాహభరితంగా జరిగాయి. విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టి రూపొందించిన వైజ్ఞానిక నమూనాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ సైన్స్ ఫెయిర్‌ను 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. మాధవి, ఎస్ఎంసీ చైర్మన్ పద్మ కలిసి ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు కేవలం చార్టులకే పరిమితం కాకుండా, ప్రయోగాత్మక నమూనాలతో అదరగొట్టారు. మేక గుండె సహాయంతో మానవ హృదయ పనితీరును విద్యార్థులు వివరించిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది. అలాగే జెనెటిక్స్‌పై రూపొందించిన డీఎన్ఏ మాడ్యూల్ అత్యంత విజ్ఞానదాయకంగా నిలిచింది. అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన ప్రగతికి నిదర్శనంగా విద్యార్థులు ప్రదర్శించిన చంద్రయాన్-2 నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హెచ్ఎం



ఆర్. మాధవి గారి పర్యవేక్షణలో సైన్స్ ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, శ్రీవాణి, కొంగ శ్రీనివాస్, దేవులపల్లి విశ్వప్రసాద్ నరసయ్య ఈ ప్రదర్శన విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జయప్రకాష్, ఉపాధ్యాయులు బండారి గంగాధర్ తిలక్, రమేష్, అశోక్, రాజమౌళి, ప్రగత్ కుమార్, అనూష, ఎండి గౌస్, మురళీకృష్ణ, దేవేందర్ రెడ్డి, రవీందర్, కరంచంద్, అనిల్, కృష్ణ, మమత, శైలజ, భార్గవి, కరుణ, పావని, రాణి తదితరులు పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

## మర్కజి స్కూల్‌లో సైన్స్ ఫేయిర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త సర్ సీవీ. రామన్ 'రామన్ ఎఫెక్ట్'ను ఆవిష్కరించిన రోజును పురస్కరించుకొని, హనుమకొండలోని ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని అత్యంత విజ్ఞానదాయకంగా నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న అన్వేషణాత్మక దృక్పథాన్ని వెలికితీసేలా ఏర్పాటు చేసిన ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.కేవలం ప్రయోగాలకే పరిమితం కాకుండా, విజ్ఞాన శాస్త్ర చిత్రాలతో పాఠశాల ప్రాంగణంలో తీర్చిదిద్దిన రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. . చిన్నారులు తమ బుర్రల్లో మెరిసిన కొత్త ఆలోచనలకు రూపమిచ్చి సుమారు 60 వైజ్ఞానిక నమూనాలను ప్రదర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి. రామారావు విద్యార్థుల ప్రదర్శనలను తిలకించి ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల హావభావ ప్రకటనలు అద్భుతంగా



ఉన్నాయని, కొత్త ఆలోచనలు, ప్రయోగాల ద్వారా చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు డాక్టర్ కె.వాసు, వీరస్వామి, ధూపాటి కిరణ్ కుమార్, డాక్టర్ టి.లింగమూర్తి, భాస్కరరావు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాట ఒక చైతన్య కెరటం..

◆ **సినీగేయ రచయిత మౌనశ్రీ మల్లిక్**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నిబద్ధత, క్రమశిక్షణ, సంస్కారవంతమైన భాషతో కూడిన రచనలే నిజమైన గేయాలని, సాహిత్య ప్రక్రియల్లో పాట అత్యంత శక్తివంతమైనదని ప్రముఖ సినీగేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ పేర్కొన్నారు. శనివారం వరంగల్ హంటర్ రోడ్డులోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞానపీఠంలో 'తెలుగు సినిమా గేయరచన' సదస్సు ఘనంగా జరిగింది. ఇదే వేదికపై అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నోముల రాజు సంపాదకత్వంలో వెలువరించిన సినీగేయ వ్యాస సంకలనం 'గేయ పరిమళాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ.. 'పాట ఒక చైతన్య కెరటం. ఒక్క పాట కోట్లాది మందిని ఒక సమూహంగా మార్చగలదు, ఆ సమూహాలను ఒక్క పిడికిలిగా చేయగలదు' అని అద్భుతంగా వివరించారు. వినూత్న పుస్తకాన్ని తెచ్చిన డాక్టర్ నోముల రాజును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు భాషా శైలిని, రచన విధానాన్ని మెరుగుపరుచుకోవడం ద్వారా అద్భుతమైన ఆర్థిక అవకాశాలను అందుకోవచ్చని సూచించారు. ఆచార్య పంతంగి వెంకటేశ్వర్లు (కేయూ విశ్రాంత ఆచార్యులు) గేయరచన అనేది ఒక అవధానం లాంటిదని, అది ఎంతో ఏకాగ్రతతో కూడిన ప్రక్రియ అని పేర్కొన్నారు. గేయ రచయిత పత్తిపాక సురేందర్ పాటలో అక్షరాల పొందిక క్రమపద్ధతిలో ఉండాలని సూచించారు.



విశ్రాంత ఉపాధ్యాయుడు గోవిందం లక్ష్మీనర్సయ్య పూర్వం పాటల కోసమే సినిమాలు చూసేవారని, పాటల్లో సమాజ స్థితిగతులను ప్రతిబింబించడం హర్షించదగిన విషయమని అన్నారు. కార్యక్రమం అనంతరం సంపాదకుడు డాక్టర్ నోముల రాజు అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ వేడుకలో పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ బాసాని సురేష్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, అబ్బు గోపాల్ రెడ్డి, డాక్టర్ సునీత, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హరీశ్‌ది 'రాజకీయ డ్రామా'

◆ **ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
◆ **అధికారంలో ఉన్న పదేళ్లలో ఏం చేశారంటూ ప్రశ్న**

**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేటలో బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావు పర్యటనపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి కాజీపేటకు చేసిందేమీ లేని నేతలు, ఇప్పుడు కార్మికుల పక్షాన పోరాటం అంటుంటే వరంగల్ ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. శనివారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టారు. 'గత పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీతో చేతులు కలిపి, రాష్ట్రంలో అధికారాన్ని వెలగబెట్టిన హరీశ్ రావుకి ఇప్పుడు కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ గుర్తుకు వచ్చిందా?' అని నాయిని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో పొన్నాల లక్ష్మయ్య మంత్రిగా ఉన్నప్పుడే రూ.20 కోట్లు మంజూరు చేసి, 54 ఎకరాల స్థలాన్ని సేకరించారని గుర్తు చేశారు. విభజన చట్టంలో సోనియా గాంధీ పొందుపరిచిన కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, ట్రైబల్ యూనివర్సిటీ వంటి హామీలను సాధించడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కేంద్రం తెచ్చిన నోట్ల రద్దు, జీఎస్టీ పన్నులు, వివాదాస్పద వ్యవసాయ చట్టాలకు అసెంబ్లీలో మొదట మద్దతు తెలిపి తీర్మానాలు చేసింది బీఆర్ఎస్ పార్టీ కాదా అని నిలదీశారు. కాజీపేటకు కనీసం 30 పడకల దవాఖానా కూడా తీసుకురాలేని 'దద్దమ్మలు' ఇప్పుడు పోరాటాల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుందని నాయిని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే కాజీపేట బస్ స్టాండ్ నిర్మాణానికి స్థల సేకరణ, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కాజీపేట ఆర్వోబీ పనుల పూర్తి. సిటీ మాస్టర్ ప్లాన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వరంగల్ విమానాశ్రయ పనుల వేగవంతం చేశామన్నారు. 'ఉమ్మడి జిల్లాలో 12 సీట్లకు గాను 11 సీట్లు కాంగ్రెస్‌కు ఇచ్చి ప్రజలు మిమ్మల్ని ఎక్కడ ఉంచారో ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోండి' అని హరీశ్ రావుకు హితవు పలికారు. వరంగల్ ప్రజలు మీ దుష్ప్రచారాలను నమ్మే స్థితిలో లేరని, కేవలం పబ్బం గడుపుకోవడానికే ఈ పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు.

## ఎన్పీడీసీఎల్ చరిత్రలో సరికొత్త రికార్డు

◆ **గరిష్ట విద్యుత్ డిమాండ్ 6,057 మెగావాట్లు**
◆ **సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడి**



**వరంగల్ వాయిస్, నక్కలగుట్ట :** తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో విద్యుత్ వినియోగం సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ మార్గదర్శకత్వంలో శనివారం ఎన్పీడీసీఎల్ చరిత్రలోనే అత్యధికంగా 6057 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైందని సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడించారు. గత ఏడాది మార్చి 11న నమోదైన 5816 మెగావాట్ల రికార్డును అధిగమిస్తూ, ఈ ఏడాది ఫిబ్రవరిలోనే డిమాండ్ 6000 మెగావాట్ల మార్కును దాటడం గమనార్హం. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా ఎక్కడా అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు సంస్థ పకడ్బందీ చర్యలు చేపట్టిందని సీఎండీ వివరించారు. డిమాండ్ పెరిగినప్పటికీ లో-వోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా సంస్థ యుద్ధప్రతిపాదికన కొత్తగా 35 (33/11 కేవీ) సబ్‌స్టేషన్ల ఛార్జింగ్ పూర్తి, 366 అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, 7600 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, 1200 కిలోమీటర్ల మేర 33 కేవీ ప్రత్యామ్నాయ లైన్లు, ఓవర్‌లోడ్ ఉన్న 8 ఫీడర్ల విభజన, లో-వోల్టేజ్ సమస్యను అధిగమించేందుకు 392 కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటు చేశారు. రానున్న మార్చి, ఏప్రిల్, మే నెలల్లో డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రత్యేక 'సమ్మర్ యాక్షన్ ప్లాన్' అమలు చేస్తున్నట్లు వరుణ్ రెడ్డి తెలిపారు. ప్రతి డివిజన్‌లో అత్యవసర స్పందన బృందాలను సిద్ధంగా ఉంచామని, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థ పనిచేస్తోందని స్పష్టం చేశారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com